# శత్రుత్వాలు

వేపచెట్టు నాకు తెలుసు. దాని ఎదుగుదల నాకు తెలుసు. ఏభైఏళ్ళ నుంచి చూస్తున్నాను. దాన్ని ఎవ్వరూ వేయలేదు. దానంతట అదే మొలిచింది. మొక్క అయింది. దాన్ని చలపతి మాస్టారు చూశారు. వెదురు కర్రలూ, ముళ్ల కంపలూ తెచ్చి దాని చుట్టూ కంచె వేశారు. రోజూ ఉదయం నీళ్ళు పోస్తుండేవారు అది పెద్దదవుతోంది. శత్రుత్వాలు ఎవరికీ తప్పవు. మేకలూ, పశువులూ, లాగేసి కొరికేస్తూ వుండేవి. అయినా అది చలపతి రక్షణలో పెద్దదయింది. మేకలకూ, పశువులకూ అందకుండా ఎదిగిపోయింది. అయితే - మనిషికి అందనిది ఏదీ వుండదు! పళ్ళు తోముకోడానికి పుల్లలకోసం విరిచేస్తూ వుండేవాళ్ళు. అంతలో చలపతి పదవీ విరమణ చేసేశారు. తెల్లవారుజామునే అక్కడికివెళ్ళి కూర్చుండేవారు. పుల్లలు విరచకుండా చూస్తుండేవారు. ఆ విధంగా ఆ చెట్టు చాలా పెద్దదయింది. ఆ వీధికి విశ్రాంతి స్థలం అయింది. పిల్లలకి ఆటస్థలం అయింది. ఆ వీధికి ఆనందాన్నీ ఆరోగ్యాన్నీ ఇస్తోంది.

★ ★ ★

చలపతి ఇల్లు అక్కడికి చాలా దగ్గరగా వుంది. జాగా బాగా పెద్దదే అయినా, ఇల్లు చాలా చిన్నది. రెండు గదుల మట్టి గోడల ఇల్లు. వెదుళ్ళతో తాటి చెక్కలతో తాటి కమ్మలతో నేసిన ఇంటికప్పు. ఆయన జీవితమంతా ఆ ఇంట్లోనే గడిచిపోయింది. పేదరికంలోనే వెళ్ళిపోయింది.

చనిపోయే ముందురోజున, రోజంతా వేపచెట్టుకిందే గడిపారు. వేపచెట్టు గాలి పీలుస్తూ తుదిశ్వాస విడిచిపెట్టేశారు. చెట్టు మిగిలింది. ఆయన పోయారు. ఆ చెట్టులో చలపతి సజీవంగా కనిపిస్తారు. ఎందుకంటే - నిర్మాణశీలతలో మనిషి మరణం తరువాత కూడా జీవిస్తాడు! ఆయన మరణం తరువాత ఆ ఇల్లు ఆయన కొడుకు ముత్తేలబాబు చేతుల్లోకి వెళ్ళిపోయింది. వేపచెట్టు ముష్టివాడి చేతుల్లోకి వెళ్ళిపోయింది.

★ ★ ★

ముష్టివాడు నాకు తెలుసు. అతడి పెరుగుదల నాకు తెలుసు. ఏభై ఏళ్ళ నుంచీ చూస్తున్నాను. అతడు ఏ ఎదుగుదలనూ ఆశించలేదు. ఎదుగుదల కోసం ఏ పనీ చేయలేదు. అతడి ఎదుగుతల వయసులో మాత్రమే వుంది.

చలపతి ఇంటి జాగాలో వెనుకవైపున ఓ మర్రిచెట్టు వుంది. అది వీధిలోకి కూడా బాగా విస్తరించేసింది. ముష్టివాడు ఆ నీడన నివాసం ఏర్పర్చుకున్నాడు. ఆ చెట్టు చలపతి ఇంటి మీదికి కూడా బాగా విస్తరించేసింది. రోడ్డు మీదకు కూడా ఎంతో విస్తరించేసింది. ముష్టివాడికి తన పుట్టుక తెలీదు. పేరు తెలీదు. సాధువుల సత్రంలో పెరిగాడు. సాధువులని పిలువబడే ముష్టివాళ్ళ చేతుల్లో పెరిగేడు. తల్లిదండ్రులెవరో తెలీదు. ఓ సాధువు చదువు చెప్పేడు. రామదాసు కీర్తనలు నేర్చాడు. తెలుగు బాగా నేర్చేడు. బాల్యం అలా గడిచాక, స్వతంత్ర జీవనం కోసం బయటకు వచ్చేశాడు. మర్రిచెట్టు కింద స్థిరపడ్డాడు. రామదాసు కీర్తనలు పాడుతూ, ఇల్లిల్లూ తిరుగుతూ, ముష్టి ఎత్తుకుంటూ బతుకు ప్రారంభించేడు. ఆ తరువాత రామదాసుగా అతడి పేరు స్థిరపడిపోయింది.

ఓ రోజున చలపతి రామదాసుని పిల్చేరు. "రామదాసూ! మర్రిచెట్టు బాగా విస్తరించేసింది. నాకే కాకుండా వీధి ప్రజలందరికీ ఇబ్బందిగా తయారైంది. అనారోగ్యాన్ని కలిగిస్తోంది. అంతేకాకుండా, రోడ్డు మీద నడిచేవాళ్ళ నెత్తిమీదా బట్టల మీదా పక్షులు రెట్టలు వేస్తున్నాయి. ప్రజలు బాధపడుతున్నారు. రోడ్డు పక్కన వేసిన ఏ మంచి మొక్కలూ బతకడం లేదు. మా ఇంటి జాగాలోనూ అంతే. మర్రిచెట్టు తన బాగే తను చూసుకుంటుంది. ఇతర మొక్కల్ని బతకనీదు! ఎదగనీదు! ఇబ్బందిగా తయారైంది! నరికించేద్దామనుకుంటున్నాను...."

'మీ ఇష్టం! మీ చెట్టు!' అని రామదాసు రెండే రెండు మాటలు చెప్పేడు. తన సామానంతా తీసుకొని వెంటనే వేపచెట్టు దగ్గరకు వెళ్ళి, ఇటూ అటూ చూసి ఆ చెట్టు కింద నివాసం ఏర్పర్చుకున్నాడు.

చలపతికి మతిపోయినట్లయింది. ఏమి చేయాలో తోచలేదు. వెంటనే రామదాసు దగ్గరికి వెళ్ళాడు. 'రామదాసూ! వేపచెట్టు ఎందరికో మంచిగాలి, చల్లని నీడ ఇస్తోంది. వీధి ప్రజలు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటున్నారు. పిల్లలు ఆడుకుంటున్నారు. అందరికీ ఉపయోగపడుతోంది. నువ్వు ఇక్కడ చేరిపోయావు! ఎందరికో ఇబ్బంది అవుతుంది! అందరికీ ఉపయోగపడకుండా పోతుంది! నీ ఒక్కడికే ఉపయోగపడేలా తయారవుతుంది! ఆలోచించుకో!' అని చలపతి చెప్పేరు.

'ఇది వీధి చెట్టు! ఇది అందరిదీనూ! నీకెంత హక్కువుందో నాకూ అంతే హక్కు వుంది! శుభ్రంగా ఉంచాలని నాకు తెలుసు! నువ్వెళ్ళు! నీ పని చూసుకో!'

అని రామదాసు కసిరేడు. చేయగలిగిందేమీ లేక చలపతి విషాదంగా ఇంటికి వెళ్ళిపోయాడు.

★ ★ ★

చలపతి పోయాక, రామదాసు ఆ చెట్టు తనే వేసి పెంచి పెద్దది చేసినట్లు అందరికీ చెప్తున్నాడు. నమ్మిస్తున్నాడు. పిల్లల్ని ఆడుకోడానికి రాకుండా అడ్డుకుంటున్నాడు. దేవుడి బొమ్మలూ, విగ్రహాలూ పెట్టి ఏవేవో పూజలు చేస్తున్నాడు. పెద్దలు కూడా రాకుండా తయారుచేశాడు. ఆ చెట్టుని తనదిగా చేసేసుకున్నాడు.

ఇంటింటా తిరుగుతూ ముష్టి ఎత్తుకుంటాడు. నాటుసారా తాగుతూ రామదాసు కీర్తనలు ఉత్తేజంగా పాడుతాడు. ఆడవాళ్ళను తెచ్చుకుంటూ వుంటాడు. నాటుసారాకి తోడు ఆడది కూడా వుండడం వల్ల తన్మయత్వంలో ఎంతో ఉత్తేజంగా మధురంగా పాడుతాడు.

★ ★ ★

చలపతి కొడుకు ముత్తేలబాబు నాకు తెలుసు. బాల్యం నుంచీ నాకు తెలుసు. ముత్తేలబాబుకి చదువులో చురుకుదనం లేదు. పనుల్లో మాత్రం పరమ పదునుగా వుండేవాడు. చలపతి ఆశించినట్లుగా అతడు పెరగలేదు. చలపతి బాధపడుతూ వుండేవారు. అతికష్టం మీద బి.ఏ. పూర్తిచేశాడు.

విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంటు పనులు ప్రారంభమయ్యాయి. మరో రెండు పెద్ద ప్రభుత్వరంగ సంస్థలు రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రైవేటు సంస్థలూ – పెట్టుబడిదారీ వర్గాలు – విశాఖకు రావడం మొదలైంది. భూమి ధర బాగా పెరుగుతూ వస్తోంది. ముత్తేలబాబు బయట నుంచి వచ్చిన కొందరు పెద్ద వ్యాపారులతో పరిచయం ఏర్పర్చుకున్నాడు. ఐదుగురు కలిసి సంస్థగా ఏర్పడ్డారు. ముత్తేలబాబు అందులో ఒకడిగా చేరేడు. తండ్రి మిగిల్చిన ఇంటి జాగాలో కొంత అమ్మేసి ఆ సంస్థలో వాటాదారునిగా చేరేడు. కాంట్రాక్టు పనులు మొదలెట్టారు. లాభాలు బాగా రావడం మొదలైంది. కొంతకాలం పోయాక, ముత్తేలబాబు మిగిలిన జాగాలో సినిమాహాలూ, మందుల షాపూ, చిన్న విశ్రాంతి భవనం కట్టించేడు. ఊరికి దూరంగా చవగ్గా జాగాకొని సొంత ఇల్లు కట్టించుకున్నాడు.

సినిమా హాల్లో సినిమా లాభాలే కాకుండా, నీలి బొమ్మల లాభాలు బాగా వస్తున్నాయి. మందుల షాపులో నకిలీ మందుల లాభాలే కాకుండా, అక్రమ

మద్యం వ్యాపార లాభాలు బాగా వస్తున్నాయి. విశ్రాంతి భవనంలో జూదాలూ, వ్యభిచారాలూ, లాభాలు కురుస్తున్నాయి. ఆ విధంగా ముత్తేలబాబు పెద్ద ఆస్తిపరుడయ్యాడు. కోట్లు సంపాదిస్తున్నాడు.

కొత్త తరానికి కొత్త రాజకీయాలు కావాలని ముత్తేలబాబు గుర్తించేడు. అప్పట్లో సంచలనాత్మకంగా వచ్చిన కొత్త రాజకీయ పార్టీలో చేరిపోయాడు. రాజకీయవ్యవస్థ విలువలను కోల్పోయి వ్యాపారంగా మారిపోయింది. ముత్తేలబాబు రాజకీయ వ్యాపారంలో పదునుగా పనిచేస్తున్నాడు. లాభాలు నొల్లుకుంటున్నాడు. కొల్లగొడుతున్నాడు.

చలపతి ఆశించింది వేరు. ఆ తరం వేరు. ఆ తరం వెళ్ళిపోయింది. ముత్తేలబాబుల తరం వచ్చేసింది. మన రాజకీయ సామాజిక వ్యవస్థను ముత్తేలబాబులే నడుపుతున్నారు. 'డబ్బు సంపాదించాలి. కష్టపడకుండా తేలిగ్గా సంపాదించాలి. తక్కువ కాలంలో కోట్లుకోట్లు కొల్లగొడుతూ కూడబెట్టాలి. ఆధిపత్యం రావాలి'. ఇదే ముత్తేలబాబుల వర్గాన్నీ, తరాన్నీ నడుపుతోంది. ఆ విధంగా బాగుపడ్డవాళ్ళు, తమ బాగుని చూసి సంతోషించేవాళ్ళూ వుండాలని కోరుకుంటారు. ముత్తేలబాబు కూడా అంతే. అందుకోసం అప్పుడప్పుడు వచ్చి నన్ను కలుస్తూ వుంటాడు.

★ ★ ★

ఓ సంవత్సరం అవుతోంది. ముత్తేలబాబు ఏదో బాధపడుతున్నట్లు కనిపిస్తున్నాడు. అయితే - ఏమీ చెప్పలేదు. ఈ మద్దిన ఓసారి నా దగ్గరకు వచ్చేడు. శత్రుత్వాల గురించి కొద్దిగా మాట్లాడేడు.

'శత్రుత్వాలు ఎందుకు ఎలా వస్తాయో తెలీదు! ఏదో శత్రుత్వం నన్ను క్రూరంగా వేటాడుతోంది?'

'మీ సంస్థ దోపిడీలు చేస్తోంది! నువ్వు ప్రజల బలహీనతల్నీ, నిస్సహాయతనూ డబ్బుగా మార్చుకుంటున్నావు! శత్రుత్వం లేకుండా ఎలా వుంటావ్?!'

'ఎవరి పీకలో కోసేసో, ఎవరి ఆస్తులో కబళించేసో నేను ధనవంతుణ్ణి కాలేదు. అలా చేస్తే, అది వ్యక్తి శత్రుత్వం అవుతుంది. కార్పొరేట్ వ్యవస్థ వేరు! ముఠా వ్యాపారం! ముఠా దోపిడీ! ప్రత్యేకించి ఏ వ్యక్తినో కాకుండా, వారి వారి

అవసరాల ఆధారంగా, వ్యవస్థలోని అవకాశాలూ, లోపాలూ ఆధారంగా, అందర్నీ దోచుకోడం! అటువంటప్పుడు, వ్యక్తి శత్రుత్వాలకు తావులేదు! వర్గ శత్రుత్వం ఉంటుంది! దానివల్ల నాకు ఏ ఇబ్బందీ లేదు!'

'రాజకీయ వ్యాపారానికి సంబంధించిన దోపిడీ ఏమో? ఆ దోపిడీ శత్రుత్వంగా మారిందేమో?'

'కాదు! అది చాలా రహస్యంగా జరుగుతుంది! అది తెలీడం అంత తేలికకాదు! తెలిసినా బయటపెట్టడానికి భయపడతారు! అదికాదు?'

'అలా కాకపోతే అసూయ కావొచ్చు!'

'అదీ కాదు! అసూయ మానవ బలహీనత! అది చిన్న శత్రుత్వమే కానీ, బలమైన శత్రుత్వం కాజాలదు! ఏడుపే ఉంటుంది! అవకాశం దొరికితే దెబ్బతీస్తారు! అంతే!'

'ఆశ్చర్యంగా వుంది?!'

'అందుకే మీతో చెప్పుకుంటున్నాను, ఏం చేయాలో తెలీడం లేదు. ఆ శత్రుత్వం ఎందుకో తెలీడం లేదు.' అలా కొంతసేపు శత్రుత్వం గురించి మాట్లాడేక, స్నేహాల గురించి కూడా కొద్దిగా మాట్లాడి వెళ్ళిపోయాడు.

★ ★ ★

ఓరోజు సాయంత్రం ముత్తేలబాబు మా ఇంటికి వచ్చాడు. 'మంచి సినిమా వచ్చింది. మా హాల్లో ఆడుతోంది. కొంతసేపు తీరిగ్గా మాట్లాడుకుందాం. ఆ తరువాత సినిమా చూద్దాం. రండి!' అని నన్ను తీసుకెళ్ళేడు. విశ్రాంతి భవనంలో బాల్కనీలో కూర్చున్నాం.

'చాలా రోజులైంది. నిద్ర పట్టడంలేదు. శత్రుత్వాన్ని భరించలేకపోతున్నాను. క్రూరంగా హింసిస్తోంది. మనసుకి స్తిమితం లేకుండా పోతోంది. భయంభయంగా వుంటోంది. మంచి మద్యం సేవించినా నిద్ర రావడంలేదు. పరస్త్రీలతో సుఖిస్తున్నా నిద్ర రావడం లేదు. ఏం చేస్తున్నా శత్రుత్వమే కళ్ళముందు కదుల్తోంది. ఏం చేయాలో తెలీడం లేదు' అని అన్నాడు.

అంతలో ఎదురుగా వేపచెట్టు కింద రామదాసు మావేపు చూస్తూ నిటారుగా

నిలబడ్డాడు. ముత్తేలబాబువేపు వేలు చూపిస్తూ సారా మత్తులో ఊగిపోతూ గంభీరంగా కేకలు వేస్తున్నాడు.

'చలపతి బాబు ఏం చేశాడు?! చెడ్డేకాని మంచి చేయని మర్రిచెట్టును నరికించేశాడు! పదిమందికి పనికొచ్చే వేపచెట్టును పెంచి పెద్దది చేశాడు! అయితే – నువ్వేంటి? మర్రిచెట్టులా ఎదిగిపోతున్నావు! నీకూ నాకూ తేడా ఏంటి? ముష్టోడికి నీకూ తేడా ఏంటి? ఇద్దరూ పరుల కష్టాన్ని కాజేస్తూ బతుకుతారు! అంతేకాదు, నీలాటోడు పరులను దోచుకుంటూ మర్రిచెట్టులా ఎదిగిపోతాడు! ముష్టోడు నేరాలు సెయ్యడు! నీలాటోడు సెయ్యని నేరవంటూ ఏటీ వుండదు! నువ్వెంతో గొప్పోడివని ఎందుకనుకుంతన్నావ్? ఎలాగ అనుకుంతన్నావ్? నేనే నీకంటే గొప్పోణ్ని! నేనే నీకంటే మంచోణ్ణి! నేనూ, నువ్వూ – నాలాటోళ్ళూ, నీలాటోళ్ళూ – ప్రజలకు శత్రువులం! నేను చిన్న శత్రువుని! నువ్వు పెద్దు శత్రువువి!'

ఆ విధంగా రామదాసు నాటుసారా మత్తులో రంకెలు వేస్తూ, తెలుగు బాగా రావడం వల్ల తడుముకోకుండా గంభీరంగా కేకలు వేశాడు.

ముత్తేలబాబు మౌనంగా వుండిపోయాడు. అతణ్ని భయపిస్తున్న శత్రుత్వం ఏంటో తెలిసిపోయింది! అతడు ప్రజాశత్రువు కావడమే అతణ్ని వెంటాడుతున్న శత్రుత్వం అని నాకు చెప్పాల్సిన అవసరం లేకుండా పోయింది!

★ ★ ★

రోజూ వేపచెట్టు దగ్గరకు వెళ్తున్నాను. రామదాసు బతికున్నాడో లేదో చూస్తున్నాను. ఆ పని అనుకోకుండా అదనంగా నా మీద పడింది!

★ ★ ★

(ఆదివారం ప్రజాశక్తి – 31.10.2004)

# సముద్రం చేసిన మనిషి

నేనూ, నాయుడూ కలిసి చదువుకున్నాం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రెండేళ్ళు కలిసి చదివాం. ఒకే గదిలో వున్నాం. చదువయ్యాక నేను ఉద్యోగం వేటలో పడ్డాను. నాయుడు ఏ వేటలో పడ్డాడో తెలీదు. ఆ తరువాత చాలాసార్లు కలుసుకున్నాం. ఏమీ చెప్పలేదు. నాకు ఉద్యోగం దొరికింది. విశాఖ విడిచి వెళ్ళిపోయాను. ఆ రోజంతా నాయుడు నాతోనే వున్నాడు. ఎన్నో కబుర్లు చెప్పాడు. ఎన్నో చిరునవ్వుల జల్లులు కురిపించాడు. తన గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. నాకే కాదు, మా మిత్రుల్లో ఎవరికీ కూడా నాయుడు ఏం చేస్తున్నాడో తెలీదు! నేను విషాదంగా విశాఖ విడిచి వెళ్లిపోయాను.

★ ★ ★

అయిదేళ్ల తరువాత విశాఖకు సెలవుమీద వచ్చాను. నాయుణ్ని కలుసుకున్నాను. ఆరోజంతా నాతోనే వున్నాడు. చురుగ్గా, ఉత్సాహంగా, సంతోషంగా కనిపించాడు. పెద్ద వ్యాపారస్తుల్లా కనిపించాడు. ఎన్నో కబుర్లు చెప్పాడు. చిరునవ్వులు కురిపించాడు. తన గురించి ఒక్కమాట కూడా చెప్పలేదు. కారులో వచ్చాడు. ఎక్కడెక్కడికి వెళ్ళాలన్నా తీసుకువెళ్ళాడు. తిరుగు ప్రయాణం రోజున రైల్వేస్టేషన్‌కి వచ్చేడు. నా సీట్లో పెట్టెలు సర్దాడు. రైలు దిగి నిలబడ్డాం. ఏవేవో కబుర్లు చెప్పుకున్నాం. రైలు కదిలే టైమవుతోంది.

'నీకు నామీద కోపంగా వుంది! నీ గురించి నువ్వు అన్నీ చెప్పేశావు. నా గురించి ఒక్కమాట కూడా నేను నీకు చెప్పలేదు. ఎందుకు చెప్పలేదు?! ఎందుకు చెప్పాలి?! నన్ను చూస్తున్నావు కదా? నా గురించి తెలుసుకోలేవా?!'

రైలు కదిలిపోతోంది. కౌగలించుకున్నాం. కరచాలనం చేసుకున్నాం. రైలెక్కిపోయాను. రైలు పరుగెడుతోంది. అతడి చిరునవ్వులు నాతో ప్రయాణం చేస్తున్నాయి.

నాయుడు ఏం చేస్తున్నాడు? నాలో నేను ప్రశ్నించుకుంటున్నాను. ఆలోచిస్తున్నాను. ప్రయాణం చేస్తున్నాను. రైలు పరుగెడుతోంది. కాలం పరుగెడుతోంది. నేను దిగాల్సిన స్టేషన్ వచ్చేసింది. రైలు ఆగింది. దిగిపోయాను. కాలం ఆగదు. పరుగెడుతూనే వుంది. నాయుడు ఏం చేస్తున్నాడో తెలీదు!

ఎందుకు చెప్పకుండా తన్ను తాను దాచుకుంటున్నాడో తెలీదు! ప్రశ్నలు ఆగవు! ఆలోచనల్లు ఆగవు! జీవితంలో పరుగులు ఆగవు!

★ ★ ★

నాయుడు ఏం చేస్తుంటే నాకేంటి? ఎందుకో తెలీదు... ఎన్నేళ్ళనుంచో నాయుడి గురించి ఆలోచిస్తూ ఎంతో విలువైన కాలాన్నీ, జీవితాన్నీ, వృథా చేసుకుంటున్నాను! ఇదేంటి? బలహీనత! నా బలహీనత్తో నాయుడు ఆడుకుంటున్నాడా?! అయినా, నాయుడి గురించి ఆలోచించకుండా ఉండలేకపోతున్నాను!

కొన్నేళ్లు గడిచిపోయాక సెలవుమీద విశాఖకు వచ్చాను. విశాఖ బాగా మారిపోయింది. ట్రావెల్ టిక్కెట్లు కోసం వెళ్లేను.

వాణిజ్య భవనాల సముదాయం... అయిదంతస్తుల భవనం... అద్దాల భవనం... అందాల భవనం... 'స్వేచ్ఛ మల్టీ సర్వీసెస్ అండ్ కన్సల్‌టెన్సీ సెంటరు... మేనేజింగ్ డైరెక్టర్, నిరుపమ... కంప్యూటర్ ట్రెయినింగ్ అండ్ సర్వీసెస్... ట్రావెల్స్... రెస్టుహోమ్స్... టూరిస్టు బస్ సర్వీసెస్... ఇంకా ఎన్నో ఎన్నో సేవలు... చిన్న చిన్న కేబిన్స్... ప్రతి కేబిన్‌లో అందమైన అమ్మాయి... అందమైన రిసెప్షనిస్టు... పెద్ద ఛాంబర్లో నిరుపమ... ఏ కేబిన్ దగ్గరకు వెళ్ళినా చిరునవ్వుల చిరుజల్లుల ఆహ్వానం... ఎందరెందరో వస్తున్నారు... పోతున్నారు...

ట్రావెల్ టిక్కెట్లు కొన్నాను. రిసెప్షనిస్టు పిలిచింది. వెళ్లాను.

'.... మా స్వేచ్ఛ సర్వీసెస్ సెంటర్ మాత్రమే కాదు... స్వేచ్ఛ ఓ ఉద్యమం... నియమాలూ, నిబంధనలూ, ఆచారాలూ, మూఢ విశ్వాసాలూ, భయాలూవంటి ఎన్నో సంకెళ్లలో మనిషి స్వేచ్ఛను పోగొట్టుకుంటున్నాడు! జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నాడు! మాది ఉద్యమం! మా స్వేచ్ఛ మీకు ఏ స్వేచ్ఛ కావాలన్నా అందిస్తుంది! ఆహ్వానిస్తుంది....' ఆమె చిరునవ్వుని తళ తళమెరిసే మంచు బిందువుల్లా కురిసింది. ఆమె వెన్నెల వానలా వుంది.

నిరుపమ ఛాంబర్లోంచి హాల్లోకి వచ్చి అటూ ఇటూ చూస్తోంది. ఆమె పన్నీటి జల్లులా వుంది. గుండ్రని బుగ్గలు చూస్తుంటే, గులాబీలు పూస్తున్నట్లుంది. ఆమె చిరునవ్వు వెన్నెల వానలా వుంది. ఆమె లావుగా, బలంగా వున్నా ఎత్తుగా కూడా వుండడం వల్ల సన్నంగా శృంగార కవితలా కనిపిస్తోంది.

ఆమెలోకి చూస్తూ నేను బయటకు వచ్చేశాను. విశాఖ వచ్చిన్నాటినుంచి నాయుడి కోసం ప్రయత్నిస్తున్నాను. ఎన్నో ఫోన్ కాల్స్ చేసాను. ఎందర్నో అడిగేను. ఎవరూ ఏమీ స్పష్టంగా చెప్పలేకపోయారు. ఇంట్లో స్వయంగా కనుక్కుందామని నాయుడి ఇంటికి వెళ్లేను. రింగ్ ఇచ్చాను. ఎవరో ఒకామె బయటకు వచ్చింది. ఆమె ఎవరో నాకు తెలీదు. నాయుడి గురించి అడిగాను.

'తెలీదండీ... ఎక్కడికి వెళ్లారో తెలీదు... ఎప్పుడొస్తారో తెలీదు... ఏ పనిమీద వెళ్లారో తెలీదు... ఏం చేస్తున్నారో తెలీదు...' అని ఆమె చెప్పి మౌనంగా నిలబడిపోయింది. ఇంట్లోకి రమ్మనమని కూడా చెప్పలేదు.

ఆమె నిరాశలో చీకటి చీకటిగా కనిపిస్తోంది. ఆమె కళ్లల్లోని తడి చీకటిగా చీకటిలా నిరాశలా ఏదో చెప్తున్నట్లుంది. ఆమె నాయుడి భార్య అయివుంటుందని అనుకున్నాను. నాయుణ్ని కలుసుకోలేకపోయినందుకు నిరాశగా వెళ్ళిపోయాను.

సెలవైపోయిం ది. నాయుణ్ని కలుసుకోలేకపోయాను. విశాఖ విడిచి వెళ్ళిపోయాను.

ఆ తరువాత ఎన్నోసార్లు వచ్చాను. వెళ్లేను. నాయుణ్ని ఎన్నోసార్లు కలుసుకున్నాను. నాయుడు ఎన్నో కబుర్లు చెప్పాడు. ఎన్నో చిరునవ్వుల జల్లులు కురిపించాడు. అయితే అతడు తన గురించి ఒక్కమాట కూడా చెప్పలేదు. నన్ను నిరాశలోనే నడిపిస్తున్నాడు. నేను నాయుడి గురించి ఆలోచిస్తూ విలువైన కాలాన్నీ, జీవితాన్నీ, వృథా చేసుకుంటున్నాను. నాయుడి గురించి ఆలోచించకుండా వుండలేకపోతున్నాను.

★ ★ ★

కాలం ఎన్నో పనులు చేయిస్తూ వుంటుంది. నాచేత పదవీ విరమణ చేయించేసింది. విశాఖకు తీసుకువచ్చేసింది. నెత్తిమీద బరువూ, గుండెల్లో దిగులూ, దింపేసుకున్నట్లు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నాను.

నాయుడు మా ఇంటికి వచ్చాడు. ప్రేమతో కౌగలించుకున్నాడు. ప్రేమ తడి, అతడి కంటితడిలో గుండెతడిలా కనిపిస్తోంది. ఏవేవో కబుర్లు... చిన్న విరామం... నిశ్శబ్దం... ఒకరిలోకి మరొకరి చూపులు... మాట్లాడుకుంటున్న మలయ మారుతపు మెరుపుచూపులు...

నాయుడి మొహంలో హఠాత్తుగా ఏదో మార్పు కనిపిస్తోంది... చీకటిని చీల్చేస్తూ చిరువెన్నెల చిరునవ్వులు... కళ్లల్లో కెరటం... గుండెల్లో సముద్రం... అనూహ్యంగా ఆశ్చర్యంగా కనిపిస్తున్నాడు... ప్రేమతో పసిపిల్లలా కనిపిస్తున్నాడు... క్రూరంగా వేటలా కనిపిస్తున్నాడు... స్నేహంలా మలయమారుతంలా చల్లగా కనిపిస్తున్నాడు....

'... నువ్వు ఉద్యోగం వేటలో పడ్డావు. నేను ఏం చేయాలో తేల్చుకోలేకపోయాను. సముద్రతీరాన ఇసుకలో రోజూ సాయంత్రం కూర్చుంటూ వుండేవాణ్ని. ఏం చేయాలో చెప్పమని ఎగిరే ప్రతికెరటాన్నీ అడుగుతూ వుండేవాణ్ని. ప్రతి కెరటం నాకో సందేశాన్ని ఇస్తూ వుండేది.... ఎగురు... అదే జీవితం... అది నీ చేతుల్లో వుంది... ఎగురు... ఆ సందేశం నాలో ఎగరడం ప్రారంభించింది...

జీవితం కెరటం కాదు! కర్తవ్యం! రోజూ ఒకాయన వస్తూ వుండేవాడు. నాకు దగ్గర్లో కూర్చుంటూ వుండేవాడు. పరిచయం చేసుకున్నాను. పరిచయం కెరటంలా ఎగురుతోంది. అతడు పెద్ద వ్యాపారస్తుడు. భార్యా కొడుకులూ కోడళ్లూ కూతుళ్లూ అల్లుళ్లూ మనవలూ మనవరాళ్లూ అందరూ వున్నారు. ఏ లోటూ లేదు. బాగా వున్నవాడు. ప్రముఖులతో పరిచయాలున్నవాడు. గౌరవంగా మర్యాదగా బతుకుతున్నట్లు కనిపిస్తాడు.

.... మనిషి ఏదో వేటాడుతూ జీవిస్తాడు. అన్నీ వున్నవాడు కూడా మరేదో లేనిదాని కోసం వేటాడుతూ జీవిస్తాడు. మరి మనిషి జీవితం ఏమిటి? ఏదో లేనిదాని కోసం వేట! అతడు కూడా ఏదో వేటలో వున్నట్లు కనిపిస్తున్నాడు...

జీవితం కళ కాదు, జీవించడం మాత్రం కళే. ఆ సత్యాన్ని సముద్ర కెరటం నుంచి నేర్చుకున్నాను. ఆమె నుంచి నేర్చుకున్నాను. ఆమె ఎవరో చెప్తాను. నిజాలు చెప్పే నీకు, నిజాలు చెప్పాలని నిశ్చయించుకున్నాను. ఎవరికీ చెప్పని నిజాలు నీకు చెప్పేస్తున్నాను.

కొద్దిసేపు విరామం... నిశ్శబ్దం... చల్లని పానీయాలు... నా భార్యా, నాయుడూ కబుర్లు ... నవ్వులు... వెన్నెల చిరుజల్లులు...

'ఆమె ఎవరో నువు నాకు చెప్పక్కర్లేదు. చూశాను. ఆమె చీకటి! ఆమె నిరాశ!...' నేను మనసులో మండిపోతున్నాను.

నాయుడు మళ్లీ వెన్నెల వాన కురుస్తున్నాడు.'... ఓ రాత్రి రైల్వేస్టేషన్‌కి వెళ్లాను. ఓ మిత్రుణ్ణి కలుసుకోడానికి వెళ్లాను. రైలు వచ్చి వెళ్ళిపోయింది. నా మిత్రుడు కనబడలేదు. అటూఇటూ తిరుగుతున్నాను.

ఓ యువతి నా వేపు పరిశీలనగా చూస్తోంది. నేను ఆమె దగ్గరకు వెళ్లేను. ఆమె నా దగ్గరకు వచ్చింది.

వెన్నెలకి కోపం వచ్చి మండితే, సూర్యుళ్లా మండుతుందో, లేదో, తెలీదు కానీ ఆమె అలా మండిపోతున్నట్లు ఆమె కళ్లల్లో మండే సూర్యుడు కనిపిస్తున్నాడు. కత్తిలాంటి కసి, మంటలాంటి పగ, కెరటంలాంటి క్రోధం ఆమెలో కనిపిస్తోంది.

"ఎవరికోసం చూస్తున్నారు?!..."

"మీ కోసమే..."

"సురేష్ వస్తానన్నాడు. రాలేదు! సురేషు మీకు...?!"

"వాడెవడో నాకు తెలీదు..."

"మీరు....."

"అన్యాయానికి బలైపోకుండా తప్పించుకొని వచ్చేశాను."

"నేను... నేను... ఎవరో మీకు తెలుసా?..."

"తెలీదు... తెలీదు... మీతో వస్తాను. పదండి... భయపడుతున్నారా?..."

నాకు కెరటం గుర్తుకొచ్చింది. కెరటం ఇచ్చిన సందేశం గుర్తుకొచ్చింది. ఆమెను నాతో తీసుకెళ్లాను. ఆమె నాతో వుంటోంది.

ఆమె పేర తల్లిదండ్రులు పది ఎకరాల భూమీ, ఓ ఇల్లూ రాసి ఇచ్చాకే.. రిజిస్ట్రేషన్ కూడా చేయించి ఇచ్చాకే పెళ్లికొడుకు పెళ్ళికి ఒప్పుకున్నాడట. అయిదు లక్షల నగదు ఇచ్చాకే అతడి తల్లిదండ్రులు పెళ్ళికి ఒప్పుకున్నారట. ఆ తరువాత పెళ్లిమాట మర్చిపోయినట్లున్నారట. ఆ తరువాత తేలిందేమిటంటే ఆ ఆస్తి అతడి పేర రాసి ఇచ్చాకే పెళ్ళి చేసుకుంటానన్నాడట. వెధవపెళ్లి వద్దనీ, వెధవతో పెళ్ళి వద్దని తప్పించుకొని ఎవరికీ చెప్పకుండా వచ్చేసిందట. ఆ క్షణంలో అటువంటి సందర్భంలో నేను తప్ప ఆమెకు ఎవరూ, ఏ దిక్కూ కనిపించలేదట. నాతో ధైర్యంగా వచ్చేసింది. ఆమె పేరు నిరుపమ."

నాయుడు ఇంకా ఏదో చెప్పబోతున్నాడు. వరుసగా ఫోన్‌కాల్స్ వచ్చేస్తున్నాయి. గబగబా వెళ్లిపోయాడు.

★ ★ ★

నేను నాయుడి గురించి ఆలోచనలో పడ్డాను. నాయుడి భార్య చీకటిలా, నిరాశలా, కన్నీటి వరదలా నా కళ్లముందు కనిపిస్తోంది. ఆమె ఏ దోపిడీ నుంచి, ఏ ద్రోహం నుంచి తనను తాను కాపాడుకోడానికి తప్పించుకొని వచ్చేసిందో, అదే దోపిడీని, ద్రోహాన్ని నాయుడు కూడా చేసేసి వుంటాడనీ, ఆమె ఆస్తిని కాజేసి ఆమె జీవితాన్ని కన్నీటివరదలా చేసేసి వుంటాడని వూహించుకుంటున్నాను.

అంతలో నాయుడు చిరునవ్వుల జల్లులా వచ్చి నా పక్కన కూర్చున్నాడు. నాలోని నిశ్శబ్దాన్ని భరించలేక చెప్పడం ప్రారంభించాడు.

"తుది శ్వాసవరకూ మనిషి తన బలహీనతల్లో జీవిస్తూ వుంటాడు. ఏదో వేటాడుతూ జీవిస్తాడు. మా వృద్ధకెరటం నుంచి ఆ సత్యాన్ని గుర్తించాను. అతడు ఓ యువతిని తనముందు నగ్నంగా పలు భంగిమల్లో నిలబెడుతూ, ఆమెలోకి లోతుగా చూస్తూ, చూపులతో వేటాడుతూ, సుఖంగా శాంతిగా తన్మయత్వంతో ఆరోగ్యంగా జీవిస్తున్నాడు. భక్తీ, వైరాగ్యం, ధ్యానం, లైంగిక నగ్నత్వం, లైంగిక సుఖం, జీవనకళ వంటి ఎన్నో జీవనాంశాలు తన్మయత్వాలే అనీ, మానవ బలహీనతలూ తన్మయత్వాలూ మంచి వ్యాపార పదార్థాలు కాగలవని గుర్తించాను. వాటిని వ్యాపార పదార్థాలుగా చేస్తూ వ్యాపారంలో అడుగుపెట్టాం. 'స్వేచ్ఛ' ఉద్యమాన్ని ప్రారంభించాం. 'జీవన కళ' ఉద్యమాన్ని ప్రారంభించాం. వ్యాపారంలో ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నాం. కోట్లు సంపాదిస్తున్నాం.

"స్వేచ్ఛ" మల్టీ సర్వీసెస్ అండ్ కన్సల్‌టెన్సీ సెంటరు మాదే. నిరుపమ, నా జీవిత భాగస్వామి, ఆ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్! నేను ప్రెసిడెంటుని. మా వృద్ధ కెరటం గౌరవ ప్రెసిడెంట్!... ఎవరికీ చెప్పని నిజాలన్నీ నీకు చెప్పేశాను...'

"ఓసారి మీ ఇంటికి వచ్చాను. ఆమె ఎవరు?!..."

"పని మనిషి..."

"ఇన్నేళ్ళుగా ఇదంతా ఎందుకు దాచేవ్?... ఎందుకు చెప్పలేదు?"

"నీ స్నేహాన్ని వదులుకోలేక?..."

"ఇప్పుడు ఎందుకు చెప్పేవ్?...

"నీమీద జాలిపడి! నిన్నింకా హింసించడం ఇష్టం లేక!..."

ఆ మాటలు చెప్పి నాయుడు తొందర పనిమీద తొందర తొందరగా వెళ్ళిపోయాడు. మా స్నేహం అంతరించిపోయింది. ఆ క్షణమే అంతరించిపోయింది!

ఎందుకంటే - మా స్నేహం కూలి పోకూడదని నాయుడు తన గురించి ఎన్నో సంవత్సరాలు నాకు చెప్పకుండా తప్పించుకున్నాడు. ప్రజా శత్రువు ఎవడైనా నాకు మిత్రుడుగా ఉండలేదని నాయుడికి బాగా తెలుసు!

★ ★ ★

(ఆంధ్రప్రభ - వారపత్రిక - 06-06-2003)